క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాల పరిశీలన



ఉపాధ్యాయుడితో మాట్లాడుతున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

పాయకరావుపేట: జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. 8వ తరగతి విద్యార్థులకు జరిగిన యూనిట్ టెస్ట్‌కు సంబంధించిన మార్కులను తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకంను పరిశీలించారు. విద్యార్థులకు చదువుపై ఉన్న సామర్థ్యాలను తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి, విద్యార్థుల మార్కులు, నోట్ పుస్తకాలను రోజూ తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం మండల పరిషత్ ఏఈగా వర్మ



ఎంవీఎస్ఎస్ వర్మ

ఎస్.రాయవరం: మండల పరిషత్ ఏఈగా ఎంవీఎస్ఎస్ వర్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతేడాది ఇక్కడ పని చేస్తున్న ఏఈ దుర్గాశంకర్ నక్కపల్లి మండలం బదిలీ కావడం తెలిసిందే. అయితే కొత్తవారిని నియమించకపోవడంతో ఎస్.రాయవరం మండలానికి కూడా దుర్గాశంకరే ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించారు. ఎట్టకేలకు కోటవురట్ల మండలం నుంచి బదిలీపై ఎంవీఎస్ఎస్ వర్మ వచ్చి ఏఈగా బాధ్యతలు చేపట్టారు.

వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక: ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మునగపాక మండలానికి కేటాయించిన లక్ష్యాన్ని వేగవంతం చేయాలన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఎల్‌డీవో మంజులావాణి, ఎంపీడీవో ప్రసాద్, హౌసింగ్ ఏఈ రాము, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి తహశీల్దారుగా శ్రీనివాసరావు

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం తహశీల్దారుగా ఎ.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం విభాగంలో సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేషన్ సెక్షన్ నుంచి బదిలీపై వచ్చారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కార్యాలయ సిబ్బంది, అధికారులు, వీఆర్‌వోలు అభినందనలు తెలిపారు.

దివంగత గాయకుడు బాలుకు ఘన నివాళి



బాలు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గాయనీ గాయకులు

తుమ్మపాల : దాదాపు 50 వేలకు పైగా అద్భుతమైన పాటలు పాడి, సంగీత దర్శకునిగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా, నటునిగా, నిర్మాతగా అనేక శాఖల్లో తనదైన ముద్ర వేసుకున్న గొప్ప గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని సంగీత దర్శకుడు ఇంద్రగంటి లక్ష్మీ శ్రీనివాస్ అన్నారు. పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని ఉడ్‌పేటలో కళ్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్‌లో బుధవారం ఆయనకు నివాళులు అర్పించారు. ఆయన పాడిన పలు గేయాలను విద్యార్థులు ఆలపించి అలరించారు. ఈ సందర్భంగా ఇంద్రగంటి లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతూ నేటితరానికి, రాబోయే తరాలకు బాలు గొప్ప స్ఫూర్తి అన్నారు. బాలు జీవితంలో పాడిన ఒకే ఒక్క లఘు చిత్రానికి తాను సంగీత దర్శకుడిగా పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

రహస్యంగా ఇళ్ల సర్వేలు ఎందుకు?

- 2014–2019 మధ్య నిర్మించిన గృహాలకు ఇప్పుడు పేమెంట్‌లు చేస్తారా?
- కూటమి నేతలతో అధికారులు అంటకాగితే మేమెందుకు?
- అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- రసాభాసగా రాంబిల్లి మండల సర్వసభ్య సమావేశం



ఇళ్ల సర్వేకు సంబంధించి హౌసింగ్ ఏఈ అనిల్‌కుమార్‌ని నిలదీస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు

రాంబిల్లి(యలమంచిలి) : రహస్యంగా ఇళ్ల సర్వేలు చేస్తున్న అధికారులపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించుకున్న జగనన్న కాలనీల ఇళ్లను పక్కనపెట్టి 2014లో ఎన్టీఆర్ కాలనీ ఇళ్లకు బిల్లులు ఇస్తామంటూ ఎటువంటి అధికారం లేని కూటమి నేతలతో కలసి గ్రామాల్లో ఎన్టీఆర్ కాలనీ లబ్ధిదారుల వెరిఫికేషన్ జాబితాను హౌసింగ్ అధికారులు ఏవిధంగా సిద్ధం రాంబిల్లి హౌసింగ్ ఏఈ అనిల్‌కుమార్‌ను నిలదీశారు. దీంతో రాంబిల్లి మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. బుధవారం రాంబిల్లి మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొట్టుముక్కల శిరీష అధ్యక్షతన జరిగింది. గత సమావేశంలో లేవనెత్తిన గ్రామాల్లో సమస్యలు ఏ మేరకు పరిష్కారమయ్యాయి.. పరిష్కారానికి నోచుకోని సమస్యలను ఎంపీడీవో కార్యాలయ అధికారులు సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం సభ ప్రారంభమైన వెంటనే శాఖల వారీ సమీక్షలో భాగంగా హౌసింగ్ స్కీంకు సంబంధించి రాంబిల్లి ఏఈ అనిల్‌కుమార్ వివరాలు చదివి వినిపిస్తుండగా.. సర్పంచ్‌లు అందరూ మూకుమ్మడిగా అడ్డుతగిలారు. గత ఐదేళ్లలో మధ్యలో అసంపూర్తిగా నిలిచిపోయిన గృహాల లబ్ధిదారులను పక్కన పెట్టి 2014లో నిర్మించిన ఎన్టీఆర్ గృహాలకు సంబంధించి సర్వేను జనసేన, టీడీపీ నేతలతో కలసి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు తెలియకుండా ఎలా చేస్తారని, ఆ ఇళ్లకు ఇప్పుడు పేమెంట్‌లు చేసుకుంటారా? అని ప్రశ్నించారు. రాంబిల్లి మండలం వ్యాప్తంగా కూటమి నేతలు రహస్యంగా సర్వే చేయడం సరికాదని, ప్రజాప్రతినిధులుగా తమకు అధికారులు తెలియజేయాల్సిన అవసరం ఉందని హౌసింగ్ ఏఈని నిలదీశారు. మండలంలో నిర్మాణ దశలో 1400 ఇళ్లు ఉన్నాయని, 2014 నుంచి 2019 వరకు మధ్యలో 802 ఎన్టీఆర్ గృహాల పేరిట నిర్మించిన వాటికి పేమెంట్‌లు చేస్తామంటూ సర్వేలు చేస్తున్నారని చెప్పారు. ప్రజా సమస్యలు పరిష్కరించలేనప్పుడు ఈ సమావేశాలు ఎందుకు అంటూ అధికారులపై మండిపడ్డారు.

- వైస్ ఎంపీపీ కొటాపు లక్ష్మి మాట్లాడుతూ దిమిలి గ్రామంలో జనాభా ప్రాతిపదికన వ్యవసాయం, పాడి పరిశ్రమపై ఆధారపడిన రైతులను గుర్తించి మినీ గోకులాలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో ఆర్‌ఎల్‌యూ రూరల్ లెజిస్టిక్ యూనిట్‌ల పశువైద్యశాలలకు వైద్యులను నియమించాలని, పశువుల రక్త నమూనా పరీక్షల ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. దిమిలి పీహెచ్‌సీలో నైట్ వాచ్‌మన్ నియమించాలన్నారు.
- కృష్ణంపాలెం సర్పంచ్ పైల సత్తిబాబు మాట్లాడుతూ గ్రామంలో ఎంఎల్‌హెచ్‌పీ అందుబాటులో ఉండడం లేదని, గ్రామంలో ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. కాలుష్యంతో సతమతమవుతున్న గ్రామంలో ప్రతి నెలా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. సీత చెరువును ఆనుకొని 100 ఎకరాలు సాగవుతుందని, ఉరగెడ్డ వద్ద ఆనకట్టు నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందని, దీనిపై దృష్టి సారించాలని నీటి పారుదల శాఖ అధికారులను కోరారు.
- హరిపురం సర్పంచ్ ధూళి దేముడమ్మ మాట్లాడుతూ హరిపురం గ్రామం ప్రధాన రహదారి నూకాలమ్మ మాన్యం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని విద్యుత్ స్తంభం పడిపోయిందని, దీనిపై విద్యుత్ శాఖ అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విద్యుత్ తీగలు కారణంగా ఏక్షణాన ఏ ప్రమాదం పొంచి ఉందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారని, తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
- జెడ్పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రాంబిల్లి మండలంలో 108 అంబులెన్స్ వాహనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. 104 సేవలు గ్రామాల్లో సరిగ్గా అందడం లేదన్నారు. గ్రామాల్లో ఏ ప్రభుత్వ కార్యక్రమం జరిగినా ప్రజాప్రతినిధులకు తప్పనిసరిగా అధికారులు తెలియజేయాలన్నారు.
- పెదకలవలాపల్లి, చినకలవలాపల్లి సర్పంచ్‌లు కనకరావు, హరిబాబు మాట్లాడుతూ తమ గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే పైపులైన్, ట్యాంక్‌లు, బోరులు నేవీ ప్రహరీ నిర్మాణంలో పోతున్నాయని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తహశీల్దారు శ్రీనివాసును కోరారు. తరచూ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని గోవిందపాలెం సర్పంచ్ జోగా మహాలక్ష్మి తెలిపారు. మురకాడ ఎంపీటీసీ తాతాజీ మాట్లాడుతూ ప్రైవేట్ దుకాణాల్లో యూరియా ఎరువు దొరుకుతుందని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎరువులు అందుబాటులో ఉండటం లేదని వ్యవసాయాధికారి సుమంతను నిలదీశారు. దీనిపై ఆమె స్పందిస్తూ రైతులందరూ ఈ–పంట నమోదు చేయించుకోవాలని కోరారు. ఏడుముళ్ల ఆనకట్టకు మరమ్మతులు, కొత్తూరు నుంచి ఏడుముళ్ల ఆనకట్టకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదనలు పంపించామని ఏఈ చిన్నారావు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కొండలరావు, కశిరెడ్డి నర్సింగరావు, మండలంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్‌కు ఘన నివాళి



పండిట్ దీన్ దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మునగపాక: మండలంలోని అరబుపాలెంలో బుధవారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ దినోత్సవం నిర్వహించారు. ముందుగా దయాల్ చిత్రపటం వద్ద పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సంపర భార్గవాచార్యులు మాట్లాడుతూ దీన్‌దయాళ్ ఆశయ సాధనకు పాటుపడాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు యల్లపు రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బొడ్డేడ భాస్కర్, యల్లపు శ్రీరాములు, రమేష్, దొడ్డి వెంకట సత్యనారాయణ, కొయిలాడ గంగాధర్, సూరప్పారావు, మోహనరావు, పైడికొండ, తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ డౌన్‌తో అవస్థలు

మునగపాక: నాలుగు రోజులుగా రెవెన్యూ కార్యాలయంలో సర్వర్ పని చేయకపోవడంతో పలు పనులపై వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. పట్టాదారు పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు పదేపదే కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదంటూ వాపోతున్నారు. సర్వర్ మొరాయించి రోజులు గడుస్తున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదంటూ గగ్గోలు పెడుతున్నారు. పదుల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నా ఉన్నతాధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోలేదంటూ మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సాంకేతిక సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

భారీ వర్షంతో వరిపైరుకు నష్టం



మునగపాకలో ముంపునకు గురైన వరి పొలం



పి.ధర్మవరంలో కురుస్తున్న వర్షం

మునగపాక: మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. రాకపోకలు సాగించేవారు అవస్థలు పడ్డారు. మునగపాక, తిమ్మరాజుపేట, వాడ్రాపల్లి ఆవ ప్రాంతాల్లో వరి పైరు ముంపునకు గురైంది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వేలాది రూపాయల పెట్టుబడులు కోల్పోవాల్సి వచ్చిందని వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ముంపునకు గురైన వరిపొలాల నుంచి కాపాడుకుంటున్న తరుణంలో అల్పపీడనం కారణంగా కురిసిన వర్షం మరింత నష్టాన్ని మిగిల్చిందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 108.8 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఎస్.రాయవరం: మండలంలో బుధవారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇటీవల భారీ వర్షాలు తరువాత ఈ వర్షం వరి పొలాలకు అనుకూలంగానే ఉంటుందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు వర్షాలు కురిస్తే పంటలు రెండో దఫా నీటమునిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తెగుళ్లు ఆశించకుండా ముందస్తు చర్యలు



జల్లూరులో వరి పైరుపై మందు స్ప్రే చేస్తున్న రైతు

కోటవురట్ల: తరచూ కురుస్తున్న వర్షాలతో వరిచేలను చీడపీడలు ఆశించే అవకాశం ఉండడంతో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తెగుళ్లు ఆశించకుండా క్రిమి సంహారక మందులు స్ప్రే చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 1650 హెక్టార్లలో వరి పంట సాగైంది. వర్షాలకు ఎక్కడ చూసినా పైరు ఏపుగా పెరిగి పచ్చగా కళకళలాడుతోంది. ప్రస్తుతం జల్లూరు, యండపల్లి, అన్నవరం, కైలాసపట్నం, రాజుపేట, రామచంద్రపురం, కోటవురట్ల, బి.కె.పల్లి, లింగాపురం ప్రాంతాలలో వరిపై క్రిమిసంహారక మందులు స్ప్రే చేస్తూ రైతులు బిజీగా ఉన్నారు.

'పొలం పిలుస్తోంది'తో రైతులకు మేలు



పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు



చినగుమ్ములూరులో వరి పొలంలో క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తున్న వ్యవసాయాధికారులు

మునగపాక: పొలం పిలుస్తోంది ద్వారా రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ రామారావు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని తిమ్మరాజుపేటలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల చెంతకు అధికారులు వచ్చి సమస్యలను నివృత్తి చేసేందుకు ఈ పొలం పిలుస్తోంది కార్యక్రమం దోహదపడుతుందన్నారు. సాగుపై రైతులకు పలు సూచనలు, సలహాలు అందించేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, సర్పంచ్ భీమిశెట్టి మంగవేణి, భీమరశెట్టి శ్రీనివాసరావు, బొడ్డేడ వెంకటరమణ, వీఏఏ శ్వేత మీనన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: వరద ముంపు నుంచి కోలుకున్న వరి పొలాలకు అవసరమైన ఎరువు పోషకాలను అందించాలని వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త గౌరికుమారి అన్నారు. చినగుమ్ములూరు, పెదగుమ్ములూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి, రైతులతో సమావేశమయ్యారు. పొలాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేసి వరి పంట ఎదుగుదలను పరిశీలించారు. తరచూ పడుతున్న వర్షాలను తట్టుకునేలా అవసరమైన మోతాదులో ఎరువులు వాడాలన్నారు. తెగులు, చీడపీడల నివారణకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సౌజన్య, చినగుమ్ములూరు సర్పంచ్ గాడి అప్పలనరసింహ, సచివాలయ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నక్కపల్లి: పెదబోదుగల్లం హైస్కూల్‌లో 1997లో చదువుకున్న పూర్వ విద్యార్థులు కమిడి రమణ, ఖాళీషా, ఈశ్వరరావు తదితరులు పాఠశాల అభివృద్ధికి ముందుకొచ్చారు. ఓ తరగతి గది మరమ్మతులకయ్యే ఖర్చులు రూ.50 వేలు అందించారు. ఈ మేరకు నగదును సర్పంచ్ ఫాతిమున్నీషా బేగం, హెచ్‌ఎం సత్యనారాయణ, గ్రామ పెద్దలు బషీర్, హుస్సేన్, లక్ష్మణరావుకు పూర్వ విద్యార్థులు బుధవారం అందజేశారు. పాఠశాల తరగతి గది మరమ్మతులకు రూ.80 వేలు అవసరం కాగా.. హెచ్‌ఎం సత్యనారాయణ మరో రూ.10 వేలు అందజేశారు. ఉపాధ్యాయులు ఎ.వి.ఎల్.ఎన్.కుమారి, ఎన్.వి.ఎస్.ఆచార్యులు, చిన్నారావు, రమేష్‌బాబు, తదితరులు దాతలను అభినందించారు. మరికొంత మంది ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.

ఉత్సాహంగా పోషకాహార వారోత్సవ ర్యాలీ



జగ్గన్నపేటలో పోషకాహార వారోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం జగ్గన్నపేటలో బుధవారం పోషకాహార వారోత్సవ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. విజయ వాహిని చారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్, ఏషియన్ పెయింట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ పోషణ సఖి ఉషారాణి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం శ్రేయస్కరమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సాగుతో అధిక ఆదాయం



పుస్తకాన్ని విడుదల చేస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి ప్రభాకరరావు

కె.కోటపాడు : ఉద్యానవన పంటల సాగుతో రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖాధికారి ప్రభాకరరావు తెలిపారు. ఉద్యానవన పంటల సాగుకు ఆసక్తి గల రైతులకు ప్రభుత్వం రాయితీలను కల్పించనున్నట్టు చెప్పారు. గొండుపాలెంలో కృషిఫల రైతు ఉత్పత్తిదారుల సంఘం 5వ వార్షికోత్సవాన్ని సంఘం చైర్మన్ బండారు దేముళ్లు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రభాకరరావు మాట్లాడుతూ కె.కోటపాడు మండలంలోని 20 గ్రామాల్లో సుమారు 500 మంది రైతులు కృషిఫల రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యులుగా ఉన్నారని చెప్పారు. ఆయా గ్రామాల్లో రైతులు పండించిన పంటలను ఉత్పత్తిదారుల సంఘానికి విక్రయించడం ద్వారా మద్దతు ధరను పొందవచ్చన్నారు. రైతులు సంఘంగా ఏర్పడి వ్యవసాయాన్ని చేస్తే ప్రభుత్వం ద్వారా ప్రోత్సాహాన్ని అందించేందుకు చర్యలను చేపట్టనున్నట్టు తెలిపారు. జాగృతి మేనేజింగ్ డైరెక్టర్ సుజాత, ఉద్యానవనశాఖాధికారి కిరణ్మయి, ఏవో సోమశేఖర్, బండారు లక్ష్మణరావు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

గొలుగొండ: మండలంలోని జమ్మేదేవిపేట సమీపంలో సారా విక్రయిస్తున్న గెమ్మల రామన్నదొర, వల్లపు రాజుబాబులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. నిందితుల నుంచి 30 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు.

కూలీ రేట్లు పెంచాలని నిరసన



కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న కూలీలు

తుమ్మపాల : తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న సివిల్ సప్లయి హమాలీల కూలీ రేట్ల అగ్రిమెంట్‌ను తక్షణమే అమలు చేయాలంటు హమాలీలు కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. మండలంలో రేబాక గ్రామంలో ఉన్న రాష్ట్ర సివిల్ సప్లయి గోదాం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లయి హమాలీస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రతి రెండేళ్లకు హమాలీల కూలీ రేట్లు పెంచాలని, గత ఏడాది డిసెంబర్ 31తో అగ్రిమెంట్ గడువు ముగిసినప్పటికీ కూలీల రేట్లు పెంచకుండ తాత్సారం చేస్తున్నారని జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి కండేపల్లి త్రినాథ్ అన్నారు. కూటమి ప్రభుత్వం హామీ మేరకు ఇప్పటికైనా హమాలీల కూలీ రేట్ల అగ్రిమెంట్ జీవోను రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీలు పోలవరపు సత్తిబాబు, సింహాచలం, సుత్తుక రాజు, కరణం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కన్నబాబు పర్యటన



హరిపాలెంలో రామప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కన్నబాబు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం, ఉప్పవరం గ్రామాల్లో బుధవారం మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తి రాజు(కన్నబాబు) పర్యటించారు. హరిపాలెం గ్రామంలో అడ్వకేట్ శరగడం అప్పలనాయుడు తండ్రి రామప్పారావు ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. రామ అప్పారావు మృతికి ఆయన సంతాపం తెలిపారు. అలాగే ఉప్పవరం మాజీ సర్పంచ్ కండిపల్లి శ్రీనివాసరావు తల్లి ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను కూడా రమణమూర్తిరాజు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, జెడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దేశంశెట్టి శంకరరావు, హరిపాలెం సర్పంచ్ మారిశెట్టి సూర్యనారాయణ, పార్టీ నాయకులు పిన్నమరాజు వాసు, పిన్నమరాజు రవీంద్ర, శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మునగపాక మండల అధ్యక్షుడు ఆడారి అచ్చియ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మించండి సారూ..



కె.వెంకటాపురం–కొడవటిపూడి రహదారి దుస్థితి

కోటవురట్ల: గట్టిగా వర్షం కురిసిందా ఆ రహదారిలో రాకపోకలు బంద్ కావాల్సిందే. తెగించి వెళ్తే వాగులో కొట్టుకుపోవడం ఖాయం. ఎన్నో ఏళ్లుగా సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వర్షాకాలంలో వాహనదారులకు అవస్థలు తప్పడంలేదు. కోటవురట్ల నుంచి కాకినాడ జిల్లా తుని వెళ్లే రహదారిలో కొడవటిపూడికి సమీపంలో కల్వర్టు లేకపోవడంతో వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. ఇక్కడ తారు రోడ్డు వేసినప్పటికీ కల్వర్టు నిర్మించకుండా వాగు నీరు ప్రవహించేలా రోడ్డు మధ్యలో కాలువలా వదిలేశారు. కుండపోతగా వర్షం కురిస్తే ఎగువ పొలాల నుంచి కాలువ ద్వారా ఉధృతంగా నీరు ప్రవహిస్తోంది. ఈ రహదారిలో ఎక్కువగా తుని వెళ్లే వారు రాకపోకలు సాగిస్తుంటారు. ఒక్కొక్కసారి నీరు ఉధృతి తగ్గకపోతే వెనుదిరగాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అధికారులు స్పందించి ఇక్కడ కల్వర్టు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

రైతుల సహకారంతోనే నాగులాపల్లి సహకార సంఘం అభివృద్ధి



నాగులాపల్లి పీఏసీఎస్ సీనియర్ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక: నాగులాపల్లి సహకార సంఘం అభివృద్ధికి రైతులు సహకరించాల్సిన అవసరం ఉందని అసిస్టెంట్ రిజిస్ట్రార్ వి.జ్యోతీశ్వరరావు తెలిపారు. మండలంలోని నాగులాపల్లి పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా సంఘం సీనియర్ సభ్యులతో పాటు పూర్వ అధ్యక్షుడు మళ్ల ఉమామహేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. అనంతరం రిజిస్ట్రార్ మాట్లాడుతూ సంస్థ అందరి సహకారంతో రూ.27.06 లక్షల మేర నికర లాభం ఆర్జించిందన్నారు. సేవల్లో ఉత్తరాంధ్రలో మేటి సొసైటీగా నాగులాపల్లి గుర్తింపు పొందిందన్నారు. రైతులకు సభ్యుల షేరు ధనంపై 15 శాతం బోనస్ ఇవ్వడం అభినందనీయమని చెప్పారు. సంఘం సీఈవో మళ్ల స్వామి, రైతులు యల్లపు భాస్కరరావు, యల్లపు వెంకటప్పారావు, బొద్దపు శ్రీరామమూర్తి, రాజునాయుడు, శివ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లెప్రసీ కేసులను గుర్తించాలి

కశింకోట : లెప్రసీ కేసులను గుర్తించడానికి పక్షం రోజులకు ఒకసారి ఆశ, ఆరోగ్య కార్యకర్తలు ఇళ్లను సందర్శించాలని ఎన్ఎల్ఈపీ, లెప్రసీ జాయింట్ డైరెక్టర్ ఎస్.దేవసాగర్ కోరారు. మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి వైద్య, ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇళ్ల వద్ద గుర్తించిన అనుమానిత కుష్టు వ్యాధి కేసులను ఆరోగ్య సిబ్బంది పీహెచ్‌సీలకు సిఫారసు చేయాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి యు. రమేష్, ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి ఎ.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.